# నా మంత్రం ఫలించింది ★

రచన :
బొంతుల అప్పారావు.

అది క్రొత్తకాపురం. మా కాంతం చాల చిలిపిది. వివాహమైన మొదట్లో నన్ను ఎంతో అల్లరిపెట్టేది. ఇపుడైనా మారిందా అంటే అబ్బే అనుమానం లేదు. అంతకంటె రెట్టింపుగా తయారయింది. అసలు మా కాంతాన్ని తలచుకొంటే లోకంలో స్త్రీలంతా ఇలా ఉంటారా అనే పెద్దసంశయము. ఆమె నాకంటె అందగత్తె. నేను కురూపున్ని కానే కాదు. ఏదో కాస్త అందమంటూ ఆ దైవశిఖామణి దయ తలచి ప్రసాదించాడు. మాకు వివాహమైంది లగాయితు నాకు మా కాంతానికి లడాకే తయారు. ఇంతకీ విశేషమేమిటో తెలియదు. ఆమె నాకు చేయవలసిన విధులు తాను లా తప్పక జరిపేది. కాని ఆమె మూతివిరుపులు, రుసరుసలముందు అవన్నీ చప్పగా నీరుబుగ్గలా ఉండేవి. ఏవి ఎలా తగులబడినా నాకు అసలు పట్టింపనేది ఉండేది కాదు. వండి వార్చినదల్లా దైవప్రసాదంలా కళ్లకద్దుకు నోట్లో పడవేసుకుని నెమ్మదిగా పడకగది చేరేవాడిని.

ఎటొచ్చీ రాత్రులు పడకగదిలోమాత్రం మాయిద్దరికి యుద్ధం జరిగేమాట యథార్థం. దీని తస్సా దియ్యా పడకగదిలో అందరూ హాయిగా కులాసాగా కబుర్లుచెప్పుకు సుఖనిద్రపోతారు. మరి మా కాంతానికి పట్టిన జబ్బు ఏమిటో కాని తాను పది గంటలయినా కుండలు మండలు సర్దుకు తెములు్సకురాదు. అలా ఎంతసేపని వేచియుండేది. ఆఫీసు పనిలో అలసిపోయిన నాజీవి కాస్త గుర్రునిద్రతో ప్రొద్దుటే మేల్కాంచేది. అన్నట్లు ఓరాత్రి మెలకువవచ్చింది. బెడ్ రూమ్‌లైట్ ఎలెక్ట్రిక్‌దీపాన్ని మించి కాలుతూంది. ఆ వెలుగులో మా కాంతం అందం అబ్బ చేప్పలేను. అకోలగా అతి సుందరమైన ముఖం, వర్చస్సు, సన్ననికంఠం. ఉఛ్వాస నిశ్వాసాలలో క్రిందికి మీదికి లేచే ఆ బిగుతైన పాలశిఖరాలూ, అన్నట్లు పమిటలేదు. మొద్దుగా నిద్రపోతూంది. "ఛీ" ఏమిటో పశువు కాకపోతే ఈ సమయంలో ఏస్త్రీ అలా ఏకాంతాన్ని కోరుతుంది. అలా దున్నలా నిద్రపోతూంది? నెమ్మదిగా కాంతంపై వరిగి గట్టిగా కౌగలించుకుని సన్నటి మెత్తని బుగ్గల్ని చటుక్కున ముద్దుపెట్టుకున్నా. కాంతం అదరిపడిలేచింది. నన్ను గిజాయించి అవలకు త్రోసివేసింది. అంత అర్థరాత్రివేళ తుర్రున ఓ పెద్ద గోలరేపింది. మగజాతి మొరటుదని, ఒకటేమిటి ఏ లక్షో ఏ కోట్లో మగవారి సద్గుణాల్ని సైతం దుర్గుణాలుగా మార్చి చెడామడా కూతలు కూసింది. దాంతో మాగొడవ తెల్లవారిన తర్వాత అగింది. నాకు మా కాంతాన్ని చూస్తే ఆడదేనా లేక......నని అనుమానం కల్గింది. తనకీ నాకూ మధ్యగా ఓసంధి ఏర్పాటు అయింది. మా కాంతం మంచానికి మధ్యగా తలగడులను గ్రేట్‌వాలులా పేర్చింది. మా కాంతానిది పాకిస్థాన్. నేను పరున్నవైపు హిందుస్థాన్ అన్నట్లు ఈహద్దులు ఏనిద్రలోనో దాటితే అంటే సంధి అతిక్రమిస్తే అది ఎంత నిశీధరాత్రి అయినా గఫిలున యుద్ధం ప్రకటింపబడేది. ఇక నాకేం పాలుపోయిందికాదు. ఏమిటా దీనికి మంత్రం అంటూ ఆలోచిస్తూ షికారుపోతున్నా. ఎదుట మెరీనాబీచ్ నన్ను ఆహ్వానిస్తూంది. నాకాళ్ళు మెరీనాను చేరాయి.

ఓచోట మెరీనాలో ఓ చిన్నగలాటా నాకంట్ల బడింది. ఆడ మగ రెండు తెగలూ తెగవాదిస్తూన్నాయి. అదేమిటో అన్న ఆత్రుతకొద్దీ అచ్చటకు హాజరయా. అది మరేం కాదు. తనభర్తనుచూచి ఓఆవిడ నవ్విందట. దాంతో జోడుతీసుకు బయలుదేరింది నవ్విన ఆవిడకు దవడ శుద్ధిచేయడానికి ఓ పతివ్రత. తనభర్త ఎంతచెప్పినా వినక తుదకు మా అందరి ప్రార్థనలవల్లా చల్లబడి తనభర్తను తీసుకు ఇంటికి దారితీసిందా పతివ్రత. ఇది చూస్తున్న నాకు చటుక్కున ఆలోచన తట్టింది. మా కాంతానికి తగ్గమంత్రం ఉపయోగించే కార్యక్రమం ఆబీచి చల్లగాలిలోనే ఆలోచించి చీకటి పడ్డ తర్వాత ఇల్లుచేరా. మధ్యలో సెంటుకొని మత్తుగా పూసుకు కులుకుతూ బయలుదేరా. మరేంకాదు ఇది మొదటి ఘట్టం.

ఈలోపునే మా కాంతం భోంచేసి ముస్తాబుగా పుస్తకము చదువుతూ ఉంది. అరగంటకల్లా భోంచేసి పడకగది చేరా. ప్రతిరోజూ నాకు సంతోషమనేది దూరం. కాని ఆనాడు సంతోషంగా ఉన్నా. నావైఖరికి కాంతంలోని మార్పులన్నీ కనిపెడుతున్నా. తాను టపీమని పుస్తకం పడవైచి లైటు మరింత పెద్దదిచేసి పాకిస్థాన్ చేరింది. నాహిందుస్థాన్ మట్టుకు పేలగా నన్ను ఆహ్వానిస్తూంది. ఇటు అటూ పచారు చేస్తూ నాలో నేను నవ్వుకోడం మొదలుపెట్టా. ఇవన్నీ చూస్తున్న కాంతం మండిపడి "మీవైఖరి చూస్తే చాల వింతగా ఉంది. ఎపుడూ ఎరుగని ఆసెంటువాసనా, దీనికి తోడు ఏవో అర్థంకాని ఆలోచన, తరువాత ముసి ముసి నవ్వులూ, ఏమిటో నాకర్థం కాకుండా ఉంది. మీకు నిద్ర వస్తుందా ? లేదా?" అంటూ ఆజ్ఞాపూర్వకంగా కందిన

మొహంతో అంది. ఇక లాభం లేదని పోయిపరున్నా. గోడ గడియారం ఏకధాటిని పది కొట్టింది. దాంతో నాదొంగనిద్ర, గుర్రుతోసహా మొదలుపెట్టా. ఇంతసేపూ నా పరిస్థితులతో తారుమారు అవుతూన్న కాంతంమాత్రం మేల్కొని ఉంది. నా మౌనమే తనకు అంత అనుమానాన్ని కల్గించి నా మంత్రం ఫలించడానికి దారితీసింది

"సీతా నీ అందం నా కాంతంముందు ఎంత చెప్పు? కాని నీవు కాంతానికంటె నన్ను మనసార ప్రేమిస్తున్నావు లాభమేమిటి?" అంటూ కలవరాలు మొదటిస్థాయిలో రెండవ ఘట్టం మొదలుపెట్టా. తుర్రున లేచింది కాంతం. యుద్ధానికి సిద్ధమయ్యే సూచనలు. నాకు ఈ హడావిడి చూస్తే చాల నవ్వు వచ్చింది. కాని నవ్వునాపుకొంటూ "నేనే నీకు దొరికానా సీతా! మరి నాకు వివాహమైంది. నీవు నన్ను ప్రేమిస్తూంటే మరి నా కాంతం బ్రతుకు? నీవు నా ప్రేయసివి కాదు. నాఅందాల దొంతికాంతంనాది. ఆమెకు ద్రోహం చేయను. మరి నీవు నన్ను ప్రేమిస్తున్నట్లు కాంతం వింటే తక్షణం హత్యచేసుకుంటుంది తన నిర్మలప్రేమను భగ్నపరచినందుకు" అంటూ ఏకధారగా కలవరింతలు వెలువడుతున్నాయి. ఇవి వింటున్న కాంతం తన ఉద్రేకాన్ని అపుకోలేకపోయింది. నాదగ్గరగావచ్చి ఎఱ్ఱబారిన ముఖాన్ని నా ముఖానికి దగ్గరగాపెట్టి వింటూంది రేడియోవార్తలు వినేలా. ఈమె చర్యలుచూస్తే నాముఖం పచ్చడయే సూచనలు కాన్పిస్తున్నాయి. "సీతా నా ఆశ వదలుకో, నాకాంతం నన్ను ఎంతో ప్రేమిస్తుంది, పూజిస్తుంది, ఒక్కనిమిషమైన విడువదు. అటువంటి నా కాంతానికి నేను ద్రోహం తలపెట్టను. రిజిష్టరుమ్యారేజిచేసుకొందామని ఎంతో తొందర పెడుతున్నావు. అది కలలోని మాట. పార్కులవద్ద, బీచీలవద్ద, సినిమాలవద్ద నన్ను పట్టుకు నామనస్సును కలవరపెట్టకు. సీతా నీవు ధనవంతురాలివే. ఈ సెంటు వాసనలు మా కాంతం పసిగడుతుంది. సెంటు నాకు పూసి నాప్రేయసికాంతానికి మనస్సు నొప్పించను. మా సుఖదాంపత్యంలో చిచ్చుపెట్టకు. అయ్యో ఈ బీచిలో అందరిముందూ ఈ సరసాలేమిటి, నన్ను వదలు, వదలు" అంటూ ఆఖరి ఘట్టం సమాప్తిచేస్తూ కంగారుతో లేవడం ఒకేసారి జరిగాయి. నాముఖం తగిలి కాంతం ముఖం పచ్చడయింది. "అబ్బ" అంటూ రాగంతీసింది. ఏమీ ఎరుగనట్లు నటించా. "అదేం కాంతం అలా నాముఖంలో ముఖంపెట్టావే అది నాతప్పుకాదు. ఏదో పిచ్చికలవచ్చి కంగారుగా లేస్తుంటే నీకు ఈపని జరిగింది. నా తప్పుంటే క్షమించు" అంటూ ఓదార్చుతూంటే "నాఖర్మ" అంటూ గొల్లుమంది. అది తనకు దెబ్బతగిలి కాదు. మంత్రం ప్రభావం. ఆమెను బుజ్జగిస్తూ పాకిస్థాన్ చేర్చా నేను హిందుస్థాన్ చేరుతూ.

మమ్మల్ని చూచి హఠాత్తుగా సిగ్గునటిస్తూ లైటు ఆరిపోయింది. నాప్రక్కనున్న గ్రేట్‌వాల్ కూలిపోయింది. హిందుస్థాన్, పాకిస్థాన్ ఏకమయ్యాయి. అపుడు తెలుసుకుంది నే నెవరినో. ఆచీకటిలో నాకుదగ్గరగా చేరి పెనవేసుకు గట్టిగా కౌగలించుకొంది. మాకాంతమేనా అనే అనుమానం. ఎంత మార్పు. నేను కూడా ఆమెను గట్టిగా కౌగలించుకొన్నా. "మరి మీరు ఇంతగా ప్రేమిస్తున్నారని తెలుసుకోలేకపోయా క్షమించండి. ఇక ఎల్లప్పుడూ మీపాద దాసిని. అన్నట్లు షికార్లుమాత్రం మానుతానని ఒట్టు వేయండి" అంటూంటే నవ్వు అపుకోలేక నవ్వుతూశపథం చేసా. నాలో లేనిఉత్సాహం పుప్పెనలా ఉబికింది. హాయిగా పరున్నాం ప్రణయకౌగిట్లో. మెల్లగా దూరంలో కోడికూత వినిపిస్తూంది.

